
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 4 అక్టోబరు 2025



సంగారెడ్డి రూరల్ ఎస్సైపై
సస్పెన్షన్ వేటు

అనుమానాస్పద మృతి కేసులో లాడ్జి ఓనర్ నుంచి డబ్బు డిమాండ్ చేసిన రవీందర్

ఇవ్వలేక ఆత్మహత్యకు పాల్పడిన ఓనర్



ఎస్సై రవీందర్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద మృతి కేసులో ఒకరి నుంచి డబ్బులు డిమాండ్ చేసి ఆ వ్యక్తి ఆత్మహత్యకు కారకుడైన సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. జోగిపేటకు చెందిన అల్లె లోకచంద్ర(31)కు సంగారెడ్డిలో చంద్రాస్ పేరుతో లాడ్జి ఉంది. చౌటకూర్ మండలం వెండికోల్ గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మణ్(36) గత నెల 28న చంద్రాస్ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు. ఈ వ్యవహారంలో సంగారెడ్డి రూరల్ పోలీసులు లోక్‌చంద్రను ప్రత్యక్ష సాక్షిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే లోకచంద్ర గత నెల 30న చౌటకూర్ మండలం శివ్వంపేట సమీపంలోని మంజీరా వంతెన వద్ద కారు ఆపి వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే, తన భర్త మృతికి సంగారెడ్డి రూరల్ ఎస్సై రవీందరే కారణమంటూ లోక్‌చంద్ర భార్య ప్రియ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. లోక్‌చంద్రను రవీందర్ డబ్బులు డిమాండ్ చేసింది వాస్తవమని, ఎస్సైకి డబ్బులు ఇవ్వలేనన్న భయంతోనే లోక్‌చంద్ర మంజీరా నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని డీఎస్పీ విచారణలో వెల్లడైంది. దీంతో ఉన్నతాధికారులు రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పండుగ పూట
విషాదం

- మాందాపూర్ బావిలో పడి వ్యక్తి మృతి
- పాతలింగాయిపల్లి పెద్దచెరువులో మునిగి ఒకరు
- పోతారం(ఎస్)లో బైక్ చెట్టుకు ఢీకొని యువకుడు
- తడ్కల్‌లో విద్యుదాఘాతంతో ఆపరేటర్ మృత్యువాత

6

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు
బీఆర్ఎస్ మద్దతు ఇవ్వాలి

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

7

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డిలో
హోరెత్తిన దసరా వేడుకలు



సంగారెడ్డి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విజయ దశమి సందర్భంగా గురువారం రాత్రి సంగారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ స్టేడియంలో రావణ దహన వేడుకలు అంబరాన్ని తాకాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. సినీ నేపథ్య గాయకులు, నృత్యకారులు, కళాకారుల ప్రదర్శనలు అబ్బురపరిచాయి. రావణ దహనం సందర్భంగా ఆకాశంలో పేలిన టపాసులు హోరెత్తించాయి.







మెదక్‌లో నిర్వహించిన దసరా వేడుకలకు హాజరైన ప్రజలు

ధూం..ధాం.. దసరా

- ఆలయాల్లో భక్తుల రద్దీ
- ఊరూరా శమీ పూజలు
- జిల్లా కేంద్రాల్లో వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- దీపావళిని తలపించిన బాణాసంచా వెలుగులు



సంగారెడ్డిలో రావణ దహనం

మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకలను మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గురువారం వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దుర్గాదేవికి హోమాలు, అభిషేకాలు జరిపించి మొక్కులు చెల్లించుకున్నారు. విజయదశమి సందర్భంగా యంత్రాలు, ఆయుధ పూజలు, వాహన పూజలు నిర్వహించారు. సాయంత్రం శమీ పూజలను నిర్వహించారు. మెదక్ కోదండ రామాలయంలో నిర్వహించిన శమీపూజలో కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు పాల్గొన్నారు. గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గా మండపాన్ని కలెక్టర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ జూనియర్ కళాశాల మైదానంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా వేడుకల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొన్నారు. శమీ పూజల అనంతరం రావణాసుర దహనం చేపట్టారు. రెండు గంటలపాటు దీపావళిని తలపించేలా బాణాసంచా కాల్చడం ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, మాజీ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు సూర్యతేజ, మ్యాడం బాలకృష్ణ, పూన రవి, రాయకంటి గంగా వెంకటేశం, కాంగ్రెస్ నేతలు గంగాధర్, ఉప్పల రాజేష్, అశోక్, శివరామకృష్ణ, కొండశ్రీను తదితరులు పాల్గొన్నారు.సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించిన రావణ దహనానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. అంతకుముందు రామమందిరం నుంచి గ్రౌండ్ వరకు సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఈశ్వరాపురంలోని సప్తప్రాకారయుత దుర్గాభవాని ఆలయంలో సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.



సంగారెడ్డిలో..

పండుగ కిక్కు...

సుక్కకు రూ. రూ.19.50కోట్లు.. ముక్కకు రూ. 5.50 కోట్లు

- గతేడాది రికార్డులు బ్రేక్
- సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో జోరుగా మద్యం అమ్మకాలు
- నిషేధం ఉన్నా మాంసం విక్రయాలు

తెలంగాణ పెద్ద పండుగలను ప్రజలు జోష్‌గా జరుపుకున్నారు. బతుకమ్మ, దసరా పండుగలకు ఊళ్లన్నీ జనాలతో కళకళలాడాయి. బతుకుదెరువు కోసం ఎక్కడెక్కడికో వెళ్లిన వారు పండుగ జరుపుకునేందుకు సొంతూరికి చేరుకున్నారు. ఆడబిడ్డలు, అయినవారిని పిలుచుకోవడంతో ఇళ్లన్నీ చుట్టాలతో నిండిపోయాయి. మందు, మాసంతో అతిథి మర్యాదలు జోరుగానే జరిగాయి. పండుగ రోజుల్లో మద్యం అమ్మకాలను పరిశీలిస్తే పాత రికార్డులు బద్దలయ్యాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మందుకు రూ. 19.50 కోట్లు, మాంసానికి రూ. 5 కోట్లు ఖర్చు చేశారు. దసరా పండుగ గాంధీ జయంతి రోజు రావడంతో ముందు రోజే కొనుగోలు చేయడం గమనార్హం.



సంగారెడ్డి క్రైం/మెదక్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లలో బతుకమ్మ, దసరా పండగల రోజుల్లో భారీగా మద్యం అమ్మకాలు జరిగాయి. సంగారెడ్డి జిల్లాలోని ఐదు సర్కిళ్ల (సంగారెడ్డి, అందోల్, నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు)లో 101 మద్యం దుకాణాలు, 34 బార్లు ఉన్నాయి. మెదక్ జిల్లాలలోని మూడు సర్కిళ్ల (మెదక్, రామాయంపేట, నర్సాపూర్)లో 49 మద్యం దుకాణాలు, 16 బార్లు ఉన్నాయి. మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్నఘనపూర్‌లోని ఐఎంఎల్ డిపో నుంచే రెండు జిల్లాలకు మద్యం సరఫరా అవుతుంది. దసరా పండుగకు ఐదు రోజుల ముందు నుంచే మద్యం విక్రయాలు పెరిగాయి.

ఐదు రోజులు జోరుగా అమ్మకాలు

బతుకమ్మ పండగ రోజు సెప్టెంబరు 30వ తేదీన మొత్తం రూ.6.01 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. రూ.5.07 కోట్ల విలువైన 6,562 ఐఎంఎల్ కార్టన్లు, రూ.94లక్షల విలువైన 4,777 కార్టన్ల బీర్లు అమ్ముడుపోయాయి. దసరాకు ముందురోజు అక్టోబరు 1వ తేదీన రూ.13.49కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో రూ.11.41 కోట్ల విలువైన 14,548 మద్యం కార్టన్లు, రూ.2.08 కోట్ల విలువైన 10,398 బీరు కార్టన్లు ఉన్నాయి. గత సంవత్సరం దసరా పండుగకు రూ.9.05కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఈసారి రెట్టింపు మద్యం విక్రయాలు జరగడం గమనార్హం.

రూ.5.50కోట్ల మాంసం విక్రయాలు

దసరా పండుగ అంటేనే మందు, మాంసం ఉంటేనే జోష్ ఉంటుంది. ఈసారి

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మద్యం అమ్మకాల వివరాలు

తేదీ	లిక్కర్ కేసులు	విలువ	బీరు కేసులు	విలువ	మొత్తం
27/9	3,157	రూ.2.32కోట్లు	3,121	రూ.0.61కోట్లు	రూ.2.93కోట్లు
28/9	6,601	రూ.5.04కోట్లు	4,117	రూ.0.82కోట్లు	రూ.5.86కోట్లు
29/9	455	రూ.0.45కోట్లు	488	రూ.0.1కోట్లు	రూ.0.55కోట్లు
30/9	6,562	రూ.5.07కోట్లు	4,777	రూ.0.94కోట్లు	రూ.6.01కోట్లు
1/10	14,548	రూ.11.41కోట్లు	10,398	రూ.2.08కోట్లు	రూ.13.49కోట్లు

ముందు డ్యూటీ.. తర్వాతే పండుగ

దసరా రోజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



పట్టణ ఆరోగ్య కేంద్రంలో మందుల నిల్వను తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిబద్ధతతో నిత్యం వార్తల్లో నిలిచే మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మరోసారి తన మార్కును చాటుకున్నారు. దసరా పండుగ రోజు కూడా విధుల్లో నిమగ్నమయ్యారు. ఆకస్మిక తనిఖీలతో ప్రజల సమస్యలపై ఫోకస్ చేశారు. దసరా రోజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెదక్ జిల్లాకేంద్రం గాంధీనగర్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర సిబ్బంది హాజరు పట్టిక, మందుల స్టాక్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. వైద్య సేవలు అందిస్తున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సక్రమంగా సేవలు అందిస్తున్నారా? అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలని పేర్కొన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. మరోవైపు పండుగ రోజు కూడా కలెక్టర్ విధి నిర్వహణలో ఉండటంపై రోగులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

నియోజకవర్గానికి మిషన్‌భగీరథ బంద్

నర్సాపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండలాలకు మంజీర ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. సంగారెడ్డి జిల్లా చక్రియాల్ నుంచి హత్నూర మండలం బోర్పట్ల ఫిల్టర్ బెడ్‌కు నీటి సరఫరా నిలిచిపోవడంతో నర్సాపూర్ నియోజకవర్గంలోని గ్రామాలకు పంపిణీ నిలిచిపోవయింది. వెండికోల్ వద్ద ప్రధాన పైపులైన్ లీకేజ్ ఏర్పడగా మంజీర నీటి ప్రవాహం ఎక్కువ ఉన్నందున మరమ్మతులు చేయడం సాధ్యం కావడంలేదు. దీంతో నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేసినట్టు మిషన్‌భగీరథ గ్రిడ్ అధికారులు వెల్లడించారు. ప్రవాహం తగ్గితే మరమ్మతులు చేపడతామన్నారు. అంతవరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు.

కాంగ్రెస్‌లో కలహాలు

జహీరాబాద్‌లో వర్గాల మధ్య పోరు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు తారాస్థాయికి చేరింది. ఓవైపు మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్.. మరోవైపు జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్.. ఇంకోవైపు సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి.. మరోవైపు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి మధ్య పార్టీ కార్యకలాపాల్లో అంతర్గతపోరు కొనసాగుతున్నది. క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

పార్టీ మండల అధ్యక్షుడి తొలగింపు

కాంగ్రెస్‌లో ఏర్పడిన గ్రూపుల ప్రభావం తదితర కారణాలు వెరసి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే నేపంతో జహీరాబాద్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డిని తొలగిస్తున్నట్లు మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తనకు అంతర్గతంగ సమాచారం ఉన్నప్పటికీ పద్ధతి మార్చుకోవాలంటూ చెప్పి చూశానన్నారు. గతంలో జరిగిన జై భారత్, జైభీం కార్యక్రమంలోనూ ఆయన పాల్గొనలేదన్నారు. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నిలకు జరుగనున్న నేపథ్యలో మండలాలవారీగా జడ్పీటీసీలు, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై నిర్ణయం తీసుకునేందుకు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఉందని నియోజకవర్గ కార్యకర్తలకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. సోషల్ మీడియాలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడన్నారని ఆరోపించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్‌వెంకటస్వామి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మాలాజగ్గారెడ్డి ఆదేశాలమేరకు ఎట్టకేలకు మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డిని తొలగిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల జరుగనున్న నేపథ్యంలో తాత్కాలికంగా కాంగ్రెస్ మండల అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అడ్‌హక్ కమిటీ అధ్యక్షులుగాఆ హుగ్గెల్లి రాములుతోపాటు వెంకట్‌రెడ్డి(హోతి-బి), నాగిశెట్టిరాథోడ్(అర్జున్‌నాయక్‌తాండ), వెంకట్‌రెడ్డి(బూచనెల్లి), చస్మొద్దీన్(శేఖాపూర్), జనార్ధన్(శేఖాపూర్), వంశీ(హోతి-బి), రవీందర్ చౌహాన్(శేఖాపూర్‌తండా), సోన్నాయి సురేష్(దిడిగి)లతోకూడిన 8మంది సభ్యులతో కార్యవర్గ సభ్యులను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఝరాసంగం, న్యాల్‌కల్ మండలపార్టీ అధ్యక్షులు హన్మంతరావుపాటీల్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు షాకీర్,తదితరులు పాల్గొన్నారు.



వర్షాలకు దెబ్బతిన్న ఆబోతుపల్లి కల్వర్టు



వర్షాలకు దెబ్బతిన్న తూప్రాన్ పెద్ద చెరువుకు వెళ్లే రోడ్డు

మరమ్మతులు ఎప్పుడో?

- దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు
- రాకపోకలకు తిప్పలు

తూప్రాన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు రోడ్డు మార్గాలు దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తూప్రాన్ మండలంలో భారీ వర్షాలు, వరదలతో హల్దీ వాగు నెలన్నరగా ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో పలు రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లి సమీపంలో హల్దీవాగుపై మల్కాపూర్ రోడ్డు కోసం ఏర్పాటు చేసిన కాజ్‌వే హల్దీవాగు ఉధృతికి కొట్టుకుపోయింది. కాజ్‌వే కిందుగా వాగు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన భారీ సిమెంట్ పైపులు కొట్టుకుపోవడంతో రాకపోకలను నిలిపివేశారు. దీంతో గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, కోనాయపల్లి (పీటీ), సిద్దిపేట జిల్లా మాచిన్‌పల్లి, ఇందుప్రియాల గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. గుండ్రెడ్డిపల్లి నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తూప్రాన్‌కు వెళ్లాలంటే చుట్టూ 12 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తున్నదని గ్రామస్థులు పేర్కొన్నారు. తూప్రాన్ పెద్దచెరువు కట్టపైకి వెళ్లే మార్గం పూర్తి దెబ్బతిన్నది. కట్టపైకి వెళ్లే రోడ్డు దెబ్బతినడంతో ప్రతియేటా నిర్వహించే వినాయక విగ్రహాల నిమజ్జనం, సద్దుల బతుకమ్మల నిమజ్జనం బయటే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెద్ద చెరువు కట్టపై సుందరీకరణ చేపట్టి పలు క్రీడా పరికరాలు, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. కొందరు యువకులు వాకింగ్, రన్నింగ్ చేస్తుంటారు. రోడ్డు దెబ్బతినడంతో కట్టపైకి వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. క్రీడా పరికరాలు, వ్యాయామ పరికరాలు వద్దకు వెళ్లలేపోతున్నారు. దీనిపై డిప్యూటీ ఈఈ విజయ్‌ప్రకాశ్ స్పందిస్తూ వరద తగ్గితే మరమ్మతులు చేస్తామన్నారు.

పండుగ పూట విషాదం

- మాందాపూర్ బావిలో పడి వ్యక్తి మృతి
- పాతలింగాయిపల్లి పెద్దచెరువులో మునిగి ఒకరు
- పోతారం(ఎస్)లో బైక్ చెట్టుకు ఢీకొని యువకుడు
- తడ్కల్‌లో విద్యుదాఘాతంతో ఆపరేటర్ మృత్యువాత

అల్లాదుర్గం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ రోజు ఉమ్మడి జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారు.... పండుగ సంబురాలను జరుపుకోవాలని స్వగ్రామానికి వచ్చి, ఈత సరదా కోసం బావి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులోనే పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలం మాందాపూర్ శివారులో గురువారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని చిల్వర్ గ్రామానికి చెందిన మాడబోయిన యాదయ్య(38) కుటుంబ సభ్యులతో కలసి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఉపాధి పొందుతున్నాడు. అయితే, బతుకమ్మ, విజయదశమి పండుగ సంబురాలను జరుపుకోవాలని ఆశించి స్వగ్రామమైన చిల్వర్‌కు మూడు రోజుల క్రితం వచ్చారు. గురువారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి ఈత కోసం మాందాపూర్ గ్రామ శివారులోని చెన్నయ్య కుంట బావి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో ఈత కోసం బావిలోకి దిగిన యాదయ్య తిరిగి పైకి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై స్థానికులకు తెలిపారు. అగ్నిమాపక సిబ్బందిని రప్పించి గాలించగా మృతదేహం లభ్యమైంది. పది రోజుల వ్యవధిలోనే ఈ బావి ఇద్దరిని బలిగొన్నది. మండలంలోని కోమటి కుంట గిరిజన తండాకు చెందిన బర్మావత్ జయరాం(30) సీతాఫలాలు తెంపుకొస్తూ ఈ బావిలో స్నానానికి దిగి, మృతిచెందాడు.


వెలికితీస్తున్న యాదయ్య మృతదేహం

చేపల వల తీస్తూ... చెరువులో మునిగి

పాపన్నపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ నీట మునిగి ఒకరు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని అబ్లియా తండాలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... గిరిజన తండాకు చెందిన లునావత్ చందర్(36) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. గురువారం ఉదయం చేపలు పట్టేందుకు పాతలింగాయిపల్లి శివారులో ఉన్న పెద్ద చెరువు వద్దకు వెళ్లి చేపల కోసం వల వేసి ఇంటికి వచ్చాడు. మళ్లీ సాయంత్రం చెరువు వద్దకు వెళ్లి వలను తీసే క్రమంలో ప్రమాదవశాత్తూ నీట మునిగిపోయాడు. అక్కడే ఉన్న వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. చెరువులో గాలించగా ఆచూకీ లభించలేదు. అప్పటికే రాత్రి కావడంతో శుక్రవారం గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య బుజ్జీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.


లునావత్ చందర్ మృతదేహం

ఎల్‌సీ తీస్తుండగా షాక్‌తో...

కంగ్టి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా మార్చేందు కోసం ఎల్‌సీ తీసుకునే క్రమంలో విద్యుదాఘాతంతో విద్యుత్ ఉప కేంద్రం ఆపరేటర్ మృతిచెందాడు. ఎస్‌ఐ దుర్గారెడ్డి తెలిపిన ప్రకారం.. తడ్కల్ గ్రామానికి చెందిన ఎల్లుట్ల అశోక్‌గౌడ్ ఐదేళ్లగా తడ్కల్ విద్యుత్ ఉప కేంద్రంలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. కాగా, విధి నిర్వహణలో భాగంగా గురువారం ఉప కేంద్రం పరిధిలోని ముర్కుంజాల్ గ్రామానికి విద్యుత్ సరఫరా మెరుగుపర్చడం కోసం లైన్ ఆఫ్ చేస్తున్నారు. పొరపాటున తడ్కల్ లైన్ ఆఫ్ చేసి, ముర్కుంజాల్ లైన్‌కు తాకగా, కుడి చేతికి తగలడంతో విద్యుదుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దుర్గారెడ్డి తెలిపారు.


అశోక్‌గౌడ్(ఫైల్)

స్నేహితునికి స్వాగతం పలికేందుకు వెళ్లి..

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన యువకుడు గురువారం తెల్లవారుజామున బైక్ చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పోతారం(ఎస్) గ్రామానికి చెందిన మార్క అజయ్(29) తన స్నేహితుడు డీఎస్పీ అయిన సందర్భంగా స్వగ్రామం పూల్‌నాయక్ తండాకు వస్తున్నాడు. అతడికి స్నేహితులతో కలిసి స్వాగతం పలికేందుకు అజయ్ వెళ్లాడు. తిరిగి ఇంటికి బైక్‌పై ఒంటరిగా బయలుదేరాడు. మార్గమధ్యన బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీ కొట్టడంతో అజయ్ తలకు, నడుముకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డు పక్కన పడి ఉన్న బైక్‌ను చూసిన గ్రామస్థులు అజయ్ తల్లితండ్రులకు విషయం చెప్పడంతో బోరున విలపిస్తు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. తండ్రి అయిలయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.


అజయ్(ఫైల్)

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

చిలప్‌చెడ్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వ్యక్తి చెరువులో పడి మృతిచెందిన సంఘటన మండలం పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫైజాబాద్ గ్రామానికి చెందిన చాకలి బాలేష్(30) గ్రామంలోని దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారి పూజ సామగ్రి, కొత్త వస్త్రంలో చుట్టి చెరువులో వేయడానికి రాత్రి 8 గంటల ప్రాంతంలో తన తల్లి బాలమణి వెంట వెళ్లాడు. ఆ సందర్భంలో బాలేష్ ప్రమాదవశాత్తు కాలుజారి పడగా ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. తల్లి గ్రామస్థులకు విషయాన్ని తెలియజేయగా, ఈతగాళ్లతో వెతికించగా రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతదేహం లభించింది. బాలేష్‌కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. భార్య విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.


బాలేష్ (ఫైల్)

వేర్వేరు చోట్ల అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

- రాజారాం తండా చౌరస్తాలో వ్యక్తి మృతదేహం
- ఇబ్రహీంపూర్‌లో మహిళ


మృతదేహం

కంగ్టి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం మండల పరిధిలోని రాజారాం తండా చౌరస్తా వద్ద జరిగింది. ఏఎస్‌ఐ కేశయ్య తెలిపిన ప్రకారం వివరాలు... రాజారాం తండా చౌరస్తాకు సమీపంలో రోడ్డు పక్కన వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు చూసి సుక్కల్ తీర్థ్ గ్రామానికి చెందిన సోపాన్(32)గా గుర్తించారు. మృతుడి సోదరి అంబవ్వ తమ్ముడి మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కేశయ్య తెలిపారు. కాగా మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

పౌల్ట్రీఫాంలో వివాహిత

చేగుంట, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామ శివారులోని పౌల్ట్రీఫాంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. పరిశ్రమ మేనేజర్, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొత్తకోట గ్రామానికి చెందిన భార్యభర్తలు ఈశ్వరి(33), నాగార్జున ఐదేళ్ల ఇబ్రహీంపూర్ పౌల్ట్రీఫాం పరిశ్రమంలో సూపర్‌వైజర్‌లుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఈశ్వరి మృతిచెంది ఉండడంతో పరిశ్రమ మేనేజర్ వీరేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. ఈశ్వరి మెడకు గాయాలవడంతో అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. భర్త నాగార్జున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలకు 15 సంవత్సరాల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.


ఈశ్వరి (ఫైల్)

ఇర్కోడు దర్గా వద్ద వ్యక్తి ఆత్మహత్య


దేవయ్య మృతదేహం

సిద్దిపేట రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు దర్గా సమీపంలో గురువారం చోటుచేసు కున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన కురాకుల దేవయ్య(45) బుధవారం ఇంటి నుంచి వెళ్లి ఇర్కోడు దర్గా సమీపంలోని వాటర్ ట్యాంకు వద్ద గుడిసెకు ఉరివేసుకున్నాడు. దర్గా సమీపంలోని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మొదట గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు విచారణ చేపట్టాగా, ధర్మారం గ్రామస్థుడిగా తెలిసింది. దర్గా పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఇంటి దారి మూసివేయడంతో మనస్తాపం వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హవేళిఘణపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలం వాడి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు.. గ్రామానికి చెందిన గుడుపల్లి సుభాష్‌రెడ్డి ఇంటికి వెళ్లేందుకు దారి ఇవ్వడంతో పాలి వారు ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో అతను ప్రజావాణిలో కలెక్టర్‌కు, మెదక్ డీఎస్పీ, సీఐ, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ నిమిత్తం జిల్లా అధికారులు రాగా, గ్రామంలో పరిష్కరించుకుంటామని చెప్పడంతో తిరిగి వెళ్లిపోయారు. రెండు నెలలు అయినా, సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపం చెందిన సుభాష్‌రెడ్డి శుక్రవారం ఇంటి వద్దే క్రిమిసంహారకమందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

- ముగ్గురికి గాయాలు

గజ్వేల్ రూరల్ అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మూడు సంవత్సరాల బాలిక మృతిచెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన గజ్వేల్ పట్టణం సంగుపల్లిలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంగుపల్లికి చెందిన నరేష్‌రెడ్డి భార్య వైష్ణవి, కుమారుడు యశ్వంత్‌రెడ్డి, కూతురు రిశ్విత(5)తో కలిసి కర్ణంపల్లిలోని ఎల్లమ్మ ఆలయానికి దర్శనానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి చేగుంట నుంచి గజ్వేల్‌కు వస్తుండగా మార్గంమధ్యలో రింగ్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనింది. ఈ ఘటనలో రిశ్విత అక్కడికక్కడే మృతిచెందింది. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి, స్థానికులు గుర్తించి 108 సిబ్బందికి సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకుని వారిని గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.


రిశ్విత (ఫైల్)

పాముకాటుతో గొర్రెలకాపరి మృతి

దుబ్బాక, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గొర్రెలకాపరిని పాముకాటు వేయగా, చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన దుబ్బాకలో చోటుచేసుకున్నది. దుబ్బాక పట్టణం రేపల్లెవాడకు చెందిన కొప్పుల కొమురయ్య, దుర్గవ్వ కుమారుడు రాజు(35) గొర్రెలకాపరి. శుక్రవారం గొర్రెల మందను తీసుకుని పట్టణంలోని ఖాళీ స్థలంలో గడ్డిమేపుతున్నారు. అక్కడే ఉన్న పాతగోడపై(పాత ఇంటి) పెరిగిన గడ్డిని మేస్తున్న గొర్లను బయటకు తీసుకొని వచ్చేందుకు వెళ్లిన రాజును అక్కడే మాటు వేసిన నాగుపాము కాటువేసింది. వెంటనే రాజును సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. రాజుకు భార్య మమత, కూతురు లిక్వీత(6), విఘ్నేష్(2) ఉన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, గొల్లకుర్మ యాదవ సంఘం నాయకులు బట్టు ఎల్లం కోరారు.


కొప్పుల రాజు(ఫైల్)

మనవరాలిని చూసేందుకు వెళ్లి అదృశ్యం


సత్యమ్మ (ఫైల్)

చేగుంట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో ఉన్న మనవరాలుని చూడడానికి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం చేగుంట మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీకి చెందిన కడమంచి సత్యమ్మ సెప్టెంబరు 30న హైదరాబాద్‌లోని నిలోఫర్ హాస్పిటల్‌లో తన మనమరాలును చూడడానికి వెళ్లింది. సత్యమ్మ అక్టోబర్1న ఆసుపత్రి నుంచి చేగుంటకు ఇంటికి బయలుదేరింది. మూడు రోజులు అయినా చేగుంటకు రాలేదు. కుంటుంబసభ్యులు చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త కడమంచి గోపాల్ ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ. 6.5 లక్షల నష్టం

సిద్దిపేట రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయిన సంఘటన శుక్రవారం సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని గడ్డం ధనకర్‌రెడ్డికి చెందిన ఇంట్లో మిటర్ వద్ద షార్ట్‌సర్క్యూట్ అయి, ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేసేసరికే ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో ఉన్న పర్నీచర్, లక్ష రూపాయల నగదు మంటల్లో పూర్తిగా దగ్ధమైదంది. ఆర్‌ఐ శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి సుమారు రూ.6.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఫైర్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది నష్టం విలువలను అంచనా వేశారు. అనుకోకుండా జరిగిన ప్రమాదంతో నిలువనీడలేకుండా పోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.


కాలిపోయి పూర్తిగా ధ్వంసమైన ఇల్లు

పెద్దశివనూరు రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చేగుంట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలం పెద్ద శివనూరు గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరు వ్యక్తులు దొంగతనం పాల్పడ్డట్టు పోలీసులు గుర్తించారు. ఈ చోరీలో, ఇత్తడి సామగ్రి, నగదు సుమారు రూ.20వేల వరకు చోరీ అయినట్టు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ప్రకటించాలి

- జస్టిస్ ఈశ్వరయ్య, ఈటల ఏదో మాట్లాడుతున్నారు
- అన్ని పార్టీలు న్యాయస్థానంలో అఫిడవిట్ సమర్పించాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతిస్తామని ప్రకటించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారావుతోపాటు మిగతా పార్టీల నాయకులకు ధన్యావాదాలు తెలుపుతున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లో జరిగిన దసరా వేడుకల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ కూడా బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇస్తామని ప్రకటించాలని కోరారు. ప్రజాపాలన ప్రభుత్వం దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ జీవో ఇచ్చిందన్నారు. బలహీనవర్గాల నాయకులమని చెప్పుకునే వారు సహకరించకపోతే మౌనంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం లీగల్‌గా చేయాల్సినవన్నీ చేసిందని, జస్టిస్ ఈశ్వరయ్య, ఈటల రాజేందర్ ఏదో మాట్లాడుతున్నారని, వారికి జ్ఞానం ఉంటే ఇంతకన్నా మంచి పద్ధతి చెప్పాలన్నారు. ఈ రిజర్వేషన్లపై పిటిషన్ వేసిన వారు దానిని ఉపసంహరించుకోవాలని మంత్రి కోరారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం, ఎంఐఎంల మద్దతు ఉందని తెలియజేసేందుకు న్యాయస్థానాల్లో అఫిడవిట్లు సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి ఉన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ మారణహోమాన్ని ఖండించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాలస్తీనాపై ఇజ్రాయెల్ మారణహోమాన్ని ఖండించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. సంగారెడ్డిలో శుక్రవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయెల్ రెండు సంవత్సరాలుగా గాజాపై చేస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలని, పాలస్తీనాను ప్రత్యేక దేశంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆ యుద్ధంలో సుమారు 65 వేల మంది చనిపోగా వారిలో అధికంగా పిల్లలు, మహిళలు ఉండడం దారుణమన్నారు. ఫార్మాతో పాటు ఎలక్ట్రానిక్, ఇంజనీరింగ్ కంపెనీలపై కూడా అమెరికా సుంకాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని అన్నారు. దీనివల్ల లక్షలాది మంది ఉపాధికి దూరమవుతారుని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఏకం కావాలసిన తరుణం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రహమాన్, కార్యదర్శి వెంటకరాజం, నాయకుడు మహబూబ్‌ఖాన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య, యదగిరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రక్షకభటులకు శిక్ష

టీఏ బిల్లులు రాక ఇబ్బందులు

- రూ.11.34 కోట్ల పెండింగ్ బకాయిలు
- సరెండర్ అమౌంట్ బకాయిలు రూ.24 కోట్లు
- సంగారెడ్డి జిల్లాలో పోలీసు సిబ్బంది వెతలు



సంగారెడ్డి క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వానికి కవచ కుండలాల పాత్ర... 24 గంటలు విధి నిర్వహణ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం అవిరళ కృషి ఒక్క పోలీసు శాఖకే సాధ్యం. కానీ, పోలీసు సిబ్బంది జీవనం, కుటుంబ పోషణ మాత్రం దైన్య స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. 24 గంటల పాటు విధి నిర్వహణలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది మూడేళ్లుగా టీఏ బిల్లులు, సరేండర్ అమౌంట్ రాక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఒక్కొక్కరికి రూ.94,500

పోలీసులు అధికారుల నుంచి మొదలు కానిస్టేబుల్ స్థాయి వరకు 1200 మంది సిబ్బంది వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వీరందరికీ 2022 నుంచి 2025 వరకు టీఏ బిల్లులు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022 సంవత్సరంలో మూడు టీఏలు, 2023లో తొమ్మిది, 2024లో పది, 2025 ఆగస్టు నెల వరకు 8 నెలలకు సంబంధించి మొత్తం 30 టీఏ బిల్లులు ప్రభుత్వం నుంచి పోలీసు సిబ్బందికి రావాల్సి ఉంది. ఒక్కో టీఏ బిల్లు దాదాపు రూ.3150 రావాల్సి ఉండగా మొత్తం 30 టీఏ బిల్లులైతే మొత్తం ఒక్కో పోలీసు సిబ్బందికి రూ.94,500 ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంది. జిల్లాలోని మొత్తం 1200 మంది పోలీసులకు గానూ మొత్తం రూ.11.34 కోట్ల బకాయిలు అందాల్సి ఉంది. ఈ మొత్తం తమకు వెంటనే చెల్లించాలని పోలీసు సిబ్బంది ఉన్నతాధికారులకు అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించినా అవి బుట్టదాఖలే అవుతున్నాయి తప్ప ప్రయోజనం లేకుండా పోయింది.

సరెండర్ అమౌంట్ రూ.2 లక్షలు

సంగారెడ్డి జిల్లాలో పోలీసు సిబ్బందికి గతేడాది 2024 జనవరి, జూలై, నవంబరు, 2025 జనవరి, జూలై నెలలకు సంబంధించిన సరెండర్ అమౌంట్ కూడా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. సరెండర్ అమౌంట్‌లో ఒక్కో నెల ఒక్కో పోలీసు అధికారి, సిబ్బందికి దాదాపు రూ.40వేలు మొత్తం ఐదు విడతలకుగానూ రూ.2 లక్షలు బకాయిలు ఉన్నాయి. మొత్తం 1200 మంది పోలీసులకు కలిపి రూ.24 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది.

పిల్లల ఫీజులూ చెల్లించలేని దైన్యం

విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచిపోయింది. పోలీసు సిబ్బంది పిల్లలను కళాశాలల్లో చేర్పించే సమయంలో మొదటి విడత ట్యూషన్ ఫీజులు, ఇతరత్రా ఫీజులు అరకొర చెల్లించారు. ఇక మూడు నెలలు గడిచిపోవడంతో రెండో విడత చెల్లింపుల కోసం కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడిలు చేస్తున్నాయని పోలీసు సిబ్బంది వాపోతున్నారు. ఇక బతుకమ్మ, దసరా, దీపావళి వంటి పండగలకు ఖర్చులు అధికం కావడం వల్ల తలకు మించిన భారంగా మారుతోందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయల రైతు బంధు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి అనేక రాయిలు కల్పిస్తున్న ప్రభుత్వం ఎండకు ఎండి, వానకు తడుస్తూ, చలికి ఓర్చి ఉద్యోగ జీవితాలు సాగిస్తున్న తమ మనోవేదన అర్థం చేసుకొని తమ టీఏ, సరేండర్ బకాయిలు వెంటనే చెల్లించాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.

పుష్కర కాలంగా జిల్లా అధ్యక్షులు వారేనా..?

ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడిన తెలంగాణ పోలీసు అధికారుల సంఘాలు ఇప్పటికీ అవే కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు సంగారెడ్డి జిల్లాలో కూడా పుష్కర కాలమైనా సంఘానికి ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమని పలువురు పోలీసు సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. అప్పట్లో ఎన్నికైన అధ్యక్షులకు పదోన్నతులు లభించడం వల్ల స్థానచలనం జరిగింది. వారంతా ఇప్పటికీ జిల్లా సంఘాల అధ్యక్ష పదవి కొనసాగిస్తున్నప్పటికీ చురుకుగా పనిచేయకపోవడం వల్ల సంఘాలు నిర్వీర్యంగా మారాయని పోలీసులే ఆరోపిస్తున్నారు. పోలీసు సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కొత్త అధ్యక్షులను ఎన్నుకుంటే సమస్యలతో పాటు బాగోగులు పట్టించుకోవడం, ప్రభుత్వానికి సమస్యలను విన్నవించడం సాధ్యమవుతుందని వారంటున్నారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

అమ్మ దర్శనం.. భక్తిపారవశ్యం

విద్యాధరి, ఏడుపాయలకు పోటెత్తిన భక్తులు... రాజరాజేశ్వరిదేవీ అలంకరణలో మాత





ఏడుపాయలలో విజయదశమి పర్వదినం సందర్భంగా అమ్మవారి పల్లకీ ఊరేగింపు, విద్యాధరి క్షేత్రంలో రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చిన విద్యాసరస్వతిమాత

వర్గల్/పాపాన్నపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రం, మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత సన్నిధికి విజయదశమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యమయ్యాయి. వర్గల్ విద్యా సరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం దసరా వేడుకలతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా విద్యాసరస్వతీ అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం విద్యాసరస్వతీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలతో పాటు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలో శమీ పూజ చేశారు. అలాగే క్షేత్రం వద్ద ఉన్న జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏడుపాయల్లో పల్లకీసేవ

పాపన్నపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల్లో శరన్నవ రాత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు గురువారం దుర్గామాత రాజరాజేశ్వరిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి స్థానిక నాయకులు, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రాల మధ్య అర్చకులు వనదుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై ఉంచి భక్తుల జయజయ ధ్వానాల మధ్య మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. శరన్నవరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను ఏడుపాయలకు తీసుకొచ్చి శుక్రవారం మంజీర నదిలో నిమజ్జనం చేశారు. రెండో బ్రిడ్జిపై వాహనాలతో ట్రాఫిక్‌జామ్ కాగా, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్‌ను క్లియరెన్స్ చేశారు.

సందర్శకుల సందడి

ఏడుపాయలలో మంజీర నది పరవళ్లు తొక్కుతుండగా సందర్శకులు సందడి చేశారు. గురువారం విజయదశమి సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులతో, శుక్రవారం దుర్గామాత నిమజ్జనానికి వచ్చే వారితో, వరద ప్రవాహాన్ని తిలకించేందుకు వచ్చిన కుటుంబసభ్యులు, స్నేహితుల బృందాలతో ఆలయానికి వచ్చే దారులన్నీ ఎటు చూసినా వాహనాలతో నిండిపోయింది. పక్కన మంజీర నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదను తిలకించి, సెల్ఫీలు దిగుతూ సందర్శకులు ఉత్సాహంగా గడిపారు. శుక్రవారం ఎగువ నుంచి వనదుర్గా ప్రాజెక్టు (ఘనపురం ఆనకట్ట)కు భారీ వరద చేరింది. సింగూరు ప్రాజెక్టు నుంచి ఉదయం 88,827 క్యూసెక్కుల నీటిని వదలగా, సాయంత్రానికి 15,749 క్యూసెక్కులకు తగ్గింది. అయినప్పటికీ దుర్గమ్మ ఆలయం ముందు నుంచి భారీగా వరద ప్రవహిస్తున్నది.

- పాపన్నపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి)



సింగూరుకు వరద తగ్గుముఖం

- 9 క్రస్ట్ గేట్లు మూసివేత

పుల్‌కల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింగూరు ప్రాజెక్టుకు ఎగువన కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతున్నది. నాలుగైదు రోజుల పాటు లక్షా 16 వేల క్యూసెక్కులకుపైగా వరద రాగా, అధికారులు 11 గేట్లు ఎత్తి వరద నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేశారు. గురువారం సాయంత్రం నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతూ వస్తున్నది. దీంతో గురువారం రాత్రి 10.30 గంటలకు మూడు క్రస్ట్ గేట్లను మూసేసి, 8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వరద ప్రవాహం మరింతగా తగ్గుముఖం పట్టడంతో ఆరు క్రస్ట్ గేట్లను మూసేశారు. ప్రస్తుతం రెండు క్రస్ట్ గేట్లను తెరిచి ఉంచారు. ఈ గేట్ల ద్వారా 14,308 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 1,441 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. హెచ్ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, 390 క్యూసెక్కులు ఆవిరి, మొత్తం ఔట్ ఫ్లో 16,833 క్యూసెక్కులు నమోదైంది. శుక్రవారం రాత్రి అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులో 520.898 మీటర్లకు 17.866 టీఎంసీల నీటి నిల్వలున్నాయి.

గీతం రసాయన శాస్త్ర విద్యార్థినికి పీహెచ్‌డీ



శశికళ

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని చీమలపాటి వీపీ శశికళ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'ఎస్‌జీఎల్‌టీ2 నిరోధకం అయిన కెనాగ్లిఫ్లోజిన్, యాంటీ, ఆండ్రోజెన్ అయిన అబిరాటెరోన్ అసిటేట్, వాటి సంబంధిత పదార్థాల సమర్థవంతమైన సంశ్లేషణ'పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు డాక్టర్ వీపీ శశికళను అభినందించారు.

రూ.7.31 లక్షల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం

- ట్రావెల్స్ బస్సులో తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు

జహీరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ మండలంలోని చిరాగ్ పల్లి ఎక్సైజ్ చెక్‌పోస్టు మీదుగా అక్రమంగా తరలిస్తున్న రూ.7.31 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలను పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ మురళీ, రమేష్ కథనం ప్రకారం.. చెక్‌పోస్ట్ వద్ద గురువారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, గోవా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఎన్ఎల్ 02బీ3185 నంబరు గల జీఎంసీ అనే సంస్థకు చెందిన ట్రావెల్ బస్సులో నైట్రోజెఫమ్ అనే మత్తు మందుకు సంబంధించిన ట్యాబ్‌లెట్లను బాక్స్‌ల్లో తరలిస్తుండగా గుర్తించారు. కర్ణాటకలోని గుల్బర్గాలో బస్సు ఆగిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బస్సు డ్రైవర్ హుమ్నాబాద్‌కు చెందిన విజయ్‌కు మత్తు మందు ట్యాబెట్లు ఉన్న బాక్స్ ఇచ్చి.. హైదరాబాద్‌లో తీసుకుంటారని చెప్పాడు. ఇందుకుగాను డ్రైవర్‌కు రూ. వెయ్యి ఇచ్చాడు. దీంతో బాక్స్ బస్సులో పెట్టేందుకు అనుమతి ఇచ్చానని, అందులో ఏముందో తనకు తెలియదని చెప్పాడు. దీంతో సదరు బస్సును, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బస్సు డ్రైవర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డ్రైవర్‌కు బాక్స్ ఇచ్చిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు వివరించారు.



పట్టుకున్న మత్తు పదార్థాలతో ఎక్సైజ్ పోలీసులు

గాంధీ విగ్రహం ధ్వంసం

- యశ్వంతరావుపేటలో ఘటన
- కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసి జయంతి నిర్వహణ





యశ్వంతరావుపేటలో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన గాంధీ విగ్రహం, కొత్త విగ్రహం నివాళులు అర్పించిన గ్రామస్థులు

వెల్దుర్తి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని యశ్వంతరావుపేట గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మహత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. తెల్లవారితే ఆయన జయంతి కావడంతో విషయం తెలిసి పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ధ్వంసం అయిన విగ్రహాన్ని టార్పాలిన్‌తో కప్పేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్దుర్తి ఎస్ఐ రాజు తెలిపారు. అయితే, గ్రామస్థులు వెంటనే ధ్వంసమైన విగ్రహాన్ని గురువారం తొలగించి, కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసి, జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. మహత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య మహాసభ మెదక్ జిల్లా అధ్యక్షుడు, నాచారం గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ చైర్మన్ పల్లెర్ల రవేందర్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా డిమాండ్ చేశారు.

బ్రిడ్జి రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, కల్చరల్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): మెదక్ నుంచి మక్త భూపతిపూర్ వెళ్లే తాత్కాలిక బ్రిడ్జి రోడ్డు మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలు, వరదల తాకిడికి గతంలో మెదక్-మక్త భూపతిపూర్ బ్రిడ్జి పరిసరాలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు జరుగుతుండగా, వాటిని కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



బ్రిడ్జి తాత్కాలిక మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

వెండికోల్‌లో ఇరువర్గాల ఘర్షణ

- పోలీసులకు పిర్యాదు

పుల్‌కల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెండికోలు గ్రామంలో దసరా వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన చాకలి రవి, చాకలి శివకుమార్ ఇద్దరు స్నేహితులు. వారి మధ్య మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. ఈ విషయాన్ని రవి తల్లి పెంటమ్మ అ గ్రామ మాజీ సర్పంచ్ గిరంగారి పల్లవి భర్త జయరాంరెడ్డికి చెప్పగా ఆయన కల్పించుకుని ఇరువురిని సముదాయించేందుకు ప్రయత్నించారు. అయితే, చాకలి రవి, శివకుమార్ గొడవ పక్కకు పోయి, జయరాంరెడ్డి ఆయన అనుచరులు శివకుమార్ మధ్య గొడవ ప్రారంభమైంది. ఇది తోపులాటకు దారితీసి, దాడులు చేసుకునే వరకు వెళ్లింది. దీంతో శివకుమార్ కంటి పైభాగంపై తీవ్ర గాయమైంది. ఘటన విషయం తెలుసుకున్న ఎస్ఐ ఎన్.విశ్వజన్ హుటాహుటినా వెండికోల్ గ్రామాన్ని తరలివెళ్లారు. ఇరు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. తనను కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు శివకుమార్ ఎస్ఐ విశ్వజన్‌కు పిర్యాదు చేశారు.

భూవివాదంలో యువకుడిపై దాడి

- ఎస్సీ ఎస్టీ కేసు నమోదు
- విచారణ చేపట్టిన ఏసీపీ నర్సింహులు

జగదేవపూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ముగ్గురు వ్యక్తులు ఓ వ్యక్తిపై దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుపై ఏసీపీ నర్సింహులు శుక్రవారం గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. అలాగే దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ కథనం ప్రకారం.. జగదేవపూర్ మండలం పీర్లపల్లి గ్రామానికి చెందిన దేవి మహిపాల్, జగదేపూర్‌కు చెందిన బచ్చలి ఎల్లయ్య, మహేష్, మల్లయ్య మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతుంది. గురువారం ఉదయం దేవి మహిపాల్ గొర్రెలు మేపుతుండగా, పాతకక్షలు మనసులో పెట్టుకున్న బచ్చలి ఎల్లయ్య, మల్లయ్య, మహేష్ కర్రతో దేవి మహిపాల్‌పై దాడి చేశారు. దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించారు. అలాగే ఓ గొర్రెను చంపి వేశారు. బాధితుడు వెంటనే జగదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో దాడి చేశారని, కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసుకున్నారు. శుక్రవారం ఏసీబీ నర్సింహులు పీర్లపల్లి గ్రామంలో దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని విచారణ చేపట్టారు.



వెల్దుర్తి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద రావణాసురుడి కటౌట్ దహనం ..



ఈదులనాగులపల్లిలో విజయపతాకానికి వందనం చేస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు బాలగోని సాయిచరణ్‌గౌడ్

అంబరాన్నంటిన దసరా సంబురం

- ఘనంగా వేడుకలు
- దుర్గామాతకు, శమీ వృక్షానికి పూజలు
- ఉత్సాహంగా రావణ దహనం

న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో విజయదశమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. దుర్గామాత విగ్రహాల నిమజ్జనాలను నిర్వహించారు. ప్రజలు జమ్మి చెట్ల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ఒకరికొకరు జమ్మి ఆకులను (బంగారం) ఇచ్చిపుచ్చుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. పాలపిట్టలను దర్శించుకున్నారు. పలుచోట్ల రావణాసుర దహన కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు బీఆర్ఎస్ నాయకులు దసరా శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో దుర్గా మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సునీత రెడ్డికి శివ్వంపేట మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్‌లో ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పటాన్‌చెరులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి , జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్ రావు దసరా వేడుకల్లో పాల్గొన్నారు. మనోహరాబాద్‌లో మెదక్ ఎంపీ రఘునందన్ రావు దుర్గామాతను దర్శించుకున్నారు. నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. పలు ప్రాంతాల్లో తొమ్మిది రోజులు పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలను నిమజ్జనం చేశారు. కల్హేర్‌లో దుర్గామాత లడ్డూలను రూ.33 వేలకు పోచబోయిన మాణిక్యం, రెండవ లడ్డూను రూ.30 వేలకు మిసాల వెంకటేష్ దక్కించుకున్నారు. పాపన్నపేట మండలం కొడుపాకలో అమ్మవారి లడ్డూ వేలం రూ.1,01,111లకు తొర్లవల్లి ప్రవీణ్ దక్కించుకున్నారు.



ఖేడ్‌లో ఎంపీ సురేష్‌షెట్కార్



శివ్వంపేట : జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్థులు



మెదక్ పట్టణంలో అమ్మవారి శోభాయాత్ర



కోహీర్ పట్టణంలో దసరా వేడుకల్లో పట్టణవాసులు



జహీరాబాద్ : బొరెగావ్‌లో దసరా వేడుకలో యువకులు



తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో దసరా వేడుకలు



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేంద్ర మంత్రికి సన్మానం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మెగ్వాల్ బీజేపీ లీగల్ సెల్ సభకు హాజరైన నేపథ్యంలో ఆయనను సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. న్యాయవాదుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన నేతలు



మాజీ మంత్రి హరీశరావుతో మఠం బిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు

పుల్‌కల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత మఠం బిక్షపతి శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి తన అనుచరులతో కలిసి వెళ్లారు. దసరా వేడుకలను పురస్కరించుకుని మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకుని దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. హరీశరావును కలిసినవారిలో మాజీ జడ్పీటీసీ ఖాదిరాబాద్ రమేశ్, కప్పాటి శ్రీనివాస్, నగేశ్ గౌడ్, అర్షద్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఎగుర వేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నారాయణఖేడ్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్‌లో గురువారం కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు మాట్లాడుతూ, దళిత సమస్యల పరిష్కారం, ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యాలతో 1998 అక్టోబరు 2న హైదరాబాద్‌లో కేవీపీఎస్ ఏర్పాటైందన్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో కుల వివక్షపై సర్వేలు నిర్వహించి ఉద్యమాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ భవన్ ఇంచార్జి భీంసేన, న్యాయవాది డ్యాని, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా ఇన్‌చార్జి గౌస్ చిస్తీ, ఆయా సంఘాల నాయకులు నారాయణ, క్రిష్ణ, తుకారం, వినోద్, మశ్చందర్, దేవానంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన నేత



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పట్టణ అధ్యక్షుడు కొల్కూరి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లేటట్టు పార్టీ శ్రేణులు కష్టపడాలని సీఎం కోరారు.

జీహెచ్‌ఎంసీ సిబ్బందికి దుప్పట్లు పంపిణీ

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు సర్కిల్‌లో పని చేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బందికి శుక్రవారం బీఆర్ఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఆదర్శ రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు, మాజీ కార్పొరేటర్ తొంటు అంజయ్య యాదవ్, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ కిక్కు..

(5వ పేజీ తరువాయి)

అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి రోజున దసరా పండుగ రావడంతో మందుతోపాటు మాంసం విక్రయాలపైనా నిషేధం ఉండటంతో ముందురోజే మాంసం విక్రయాలు కూడా జోరుగా సాగాయి. బుధవారం సాయంత్రం నుంచే మాంసం దుకాణాల ముందు జనం క్యూ కట్టారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో దసరా రోజున రూ.5.50కోట్ల మాంసం విక్రయాలు జరిగినట్టు అంచనా వేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 1,200 మాంసం దుకాణాలు, మెదక్ జిల్లాలో 600 మాంసం దుకాణాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 500 క్వింటాళ్ల, మాంసం విక్రయాలు జరిగినట్టు అంచనా. దీని విలువ రూ.3.50కోట్లు ఉంటుంది. మెదక్ జిల్లాలోని 600 దుకాణాల్లో రూ.2కోట్ల విక్రయాలు జరిగినట్టు అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

పెద్దశంకరంపేట/నారాయణఖేడ్,అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వాసూరు మురళిపంతులు శుక్రవారం తన అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డిలకు లేఖలను పంపినట్లు ఆయన తెలిపారు. కాగా, నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో మురళి పంతులు, మాజీ ఉప సర్పంచ్ సుధీర్, పలువురు తాజా మాజీ వార్డు సభ్యులు రాజుగౌడ్, రామన్న, రజనీకాంత్, నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మనోహర్, రజక సంఘం అధ్యక్షుడు చాకలి ప్రభు, తిరుమలాపూర్ యూత్ అధ్యక్షుడు మల్లేశంతో పాటు పలువురు మైనార్టీ నాయకులు, అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాము అన్ని వర్గాల వారి అభిప్రాయాలు తెలుసుకున్నాకే మురళి పంతులును పార్టీలోకి తీసుకున్నామన్నారు. భూకబ్జాలకు పాల్పడిన వారిని, సొంత పార్టీ వారినైనా సహించే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తాను పదేళ్ల బీఆర్ఎస్‌లో పని చేసినా తన సేవలను గుర్తించలేదని, అందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నానని మురళి పంతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్‌రెడ్డి, నారాగౌడ్, సుభాష్‌గౌడ్, మాజీ ఆత్మ చైర్మన్ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మురళి పంతులుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

దేశభక్తిని చాటడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

- అఖిల భారత మార్గదర్శక్ సోమయాజులు



కొండాపూర్ : శతాబ్ది ఉత్సవాలలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కొండాపూర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంపై భక్తిని చాటిచెప్పేందుకు, భారత మాత బిడ్డలుగా, భగత్ సింగ్ వారసులుగా చరిత్రను తెలియపరిచి సంఘటితం చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని అఖిల భారత మార్గదర్శక్ సోమయాజులు అన్నారు. గురువారం కొండాపూర్ మండలం గొల్లపల్లిలో ఆర్ఎస్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు సోమయాజులుతో పాటు ఉమ్మడి ఏపీ భారతీయ కిసాన్ సంఘం మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, రిటైర్డ్ ఆర్మీ నరేందర్ గౌడ్ హాజరయ్యారు.

- నారాయణఖేడ్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులతో పాటు భారత్ మాత చిత్రపటాలకు పూలమాలలు వేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం సంఘం చేస్తున్న కృషిని సంఘం బాధ్యులు వివరించారు.

- తూప్రాన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం సాయంత్రం తూప్రాన్ పట్టణంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పద సంచలన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో 250 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు. పద సంచలన్‌కు తూప్రాన్ ఎస్ఐ శివానందం ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



తూప్రాన్‌లో ఆర్ఎస్ఎస్ పద సంచలన్

బెల్టు షాపులపై దాడులు

శివ్వంపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం మండలంలో బెల్టు షాపులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని పెద్దగొట్టిముక్కలోని మూడు కిరాణా షాపుల్లో దాడులు నిర్వహించి ఎండీ మోహిన్, మంత్రి ఎల్లేందర్, చేగూరి శేఖర్, చిన్నగొట్టిముక్క గ్రామంలోని మరో బెల్టు షాప్‌తో కలిపి మొత్తం నాలుగు బెల్టు షాపులపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచిరూ.31,658 విలువైన 63 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

ఇద్దరిపై దాడి

పటాన్‌చెరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవం చూస్తున్న ఇద్దరిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపల్ కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న విష్ణు, కిరణ్‌లు పాశమైలారంలోని రావణదహనం కార్యక్రమం చూడటానికి వెళ్లారు. అక్కడ సాయిసాగర్ ఫుడ్ ఇండస్ట్రీస్‌కు చెందిన నలుగురు వ్యక్తులు వారిని కట్టెలతో కొట్టి గాయాలు చేశారు. వారి మోటారుసైకిల్‌ను కూడా ధ్వంసం చేశారు. తల్లి బేగరి గాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డీఎస్పీగా ఎంపికైన ప్రభాత్‌రెడ్డికి సన్మానం



డీఎస్పీగా నియమితులైన ప్రభాత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఖేడ్ నియోజకవర్గంలోని పెద్దశంకరంపేట పరిధిలోని మూసాపేట గ్రామానికి చెందిన ఈరగారి ప్రభాత్‌రెడ్డి గ్రూప్-1 ఫలితాల్లో విజయం సాధించి డీఎస్పీగా నియమితులయ్యారు. శుక్రవారం ఆయన నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాత్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీ సురేష్ షెట్కార్ కూడా ప్రభాత్‌రెడ్డిని సన్మానించారు.

జీపీ కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఉప సర్పంచ్ కాళిదాస్

మనోహరాబాద్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా పంచాయతీ కార్మికులకు మాజీ ఉప సర్పంచ్ దుస్తులను పంపిణీ చేశారు. మనోహరాబాద్ మండలం, కాళ్లకల్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఎస్పీ కాళిదాస్ తన సొంత ఖర్చులతో కాళ్లకల్ గ్రామ పంచాయతీ కార్మికులకు దుస్తులు, షూస్‌ను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం పదవితో సంబంధం లేకుండా దసరాకు దుస్తులు అందిస్తున్నారని తెలిపారు. దీంతో పంచాయతీ కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.

సీడీసీ చైర్మన్‌గా ముభిన్



సీడీసీ చైర్మన్, డైరెక్టర్లను సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ సీడీసీ చైర్మన్‌గా మొగుడంపల్లి మండలంలోని అసద్‌గంజ్‌కు చెందిన ముభిన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులను వెలువరించింది. ఈ సందర్భంగా పట్టణంలోని ఉజ్వల్‌రెడ్డి గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం నూతనంగా ఎన్నికైన సీడీసీ చైర్మన్ ముభిన్ , సభ్యులు మల్లారెడ్డి, చందర్‌నాయక్‌లను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.



జిన్నారంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు



ఖేడ్‌లో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీ, కిష్టారెడ్డి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మహాత్ముడికి ఘన నివాళి

- ఘనంగా మహాత్మా గాంధీ, దేశ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి
- చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు

న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, మెదక్ జిల్లా వ్యాప్తంగా గురువారం మహాత్మా గాంధీ, దేశ మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు వారి చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ సిద్ధాంతాలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని నేతలు కొనియాడారు. సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టరేట్ ఏవో అంథోని, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మెదక్ పట్టణంలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ నివాళులర్పించారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు తమ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. మెదక్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రమాదేవి, వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించారు. జిన్నారంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రారంభించి నివాళులర్పించారు. నారాయణఖేడ్‌లో ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తన నివాసంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ, దివంగత ఎమ్మెల్యే కిష్టారెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహానికి ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి, టీజేఎస్ యువత, తెలంగాణ సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని చౌరస్తాలో మండల బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో, తూప్రాన్ పట్టణం, పెద్దశంకరంపేటలో ఆర్యవైశ్య సంఘం, మండల కాంగ్రెస్ నాయకులు, నారాయణఖేడ్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, టీఎస్‌యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటలో మహాత్మ గాంధీ విగ్రహం ధ్వంసం కావడాన్ని మాజీ జడ్పీటీసీ, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు బి. శ్రీనివాస్‌గుప్తా తీవ్రంగా ఖండించారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పంకజ్



పెద్దశంకరంపేటలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం బాధ్యులు, నాయకులు